క్లుప్తంగా

డ్రై డే పాటించాలి



మురుగు నీటిలో అబిట్ మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎన్‌పీకుంట: ప్రజలు వ్యాధులు ప్రబలకుండా తప్పక డ్రై డే పాటించాలని ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని మరికొమ్మదిన్నె గ్రామంలో శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రోగాలు ప్రబలడానికి ముఖ్య కారణం దోమలు అని, దోమల వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పకుండా డ్రై డే పాటించాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు వీధులలో వైద్య సిబ్బంది పర్యటించి మురికి నీటి కాలువల్లో అబిట్, పైరత్రియం పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రాఘవేంద్ర, ఏఎన్ఎం దేవి, మహిళా పోలీస్ గీత, ఆశాకార్యకర్త పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తూ రిటైర్డ్ అయిన జాసన్‌కుమార్ (62) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిపోలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్, ఆఫీసు సిబ్బంది శ్రీనివాసులు, అబ్బాస్, బాబు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



లబ్ధిదారుడికి బ్రోచర్ అందిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిప్పేపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. గత మూడేళ్లలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లను అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

సజావుగా వారపు సంత వేలం

తలుపుల: మండల కేంద్రంలో శుక్రవారం వారపుసంతకు సర్పంచ్ శ్రీలత, ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో ఈఓ మాధవరెడ్డి వేలంపాట నిర్వహించారు. 8 మంది రూ.50 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. సయ్యద్ మైనుద్దీన్ రూ.4.52 లక్షలకు వేలం పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శకుంతల, వార్డు మెంబర్లు సుబహాన్, యూసూఫ్, గిరి పాల్గొన్నారు.

నేడు వారపు సంతకు వేలంపాట

తనకల్లు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం వారపు సంత, పంచాయతీ కాంప్లెక్స్ రూములకు వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి కృష్ణమూర్తి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారపు సంతకు వేలంపాటలో పాల్గొనేవారు రూ. 25 వేలు, కాంప్లెక్స్ రూంలకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.15 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. సాయంత్రం 3 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.

31న జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్

ప్రశాంతి నిలయం: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఈనెల 31న నిర్వహించే జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియంను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిత్ కుమార్ కోరారు. శుక్రవారం ఉదయం కళాశాల ప్రాంగణంలో సింపోజియంకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఎకో ఫ్రెండ్లీ బిల్డింగ్స్, మెటీరియల్స్, అక్వెన్స్, కాంక్రీట్ టెక్నాలజీ, గ్రీన్ బిల్డింగ్, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సింపోజియంకు దేశీయంగా సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు పాల్గొంటారన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

ఈదురు గాలుల బీభత్సం

- అకాల వర్షానికి నేలకొరిగిన చెట్లు
- దెబ్బతిన్న బీర, టమాట, మొక్కజొన్న తదితర పంటలు



అమడగూరు: కసముద్రంలో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కదిరి టౌన్: పట్టణంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంట పాటు వడగండ్ల వర్షం కురవడంతో దుకాణదారులు, పట్టణ ప్రజలు ఇబ్బంది పడ్డారు. పట్టణంలో 28.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అగ్రికల్చర్ అధికారులు తెలిపారు. ఈదురు గాలులకు లక్ష్మణ్ నగర్‌లో పెద్ద పెద్ద చెట్లు నేలకొరగాయి. సరస్వతి విద్యామందిరం వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరగాయి. సున్నపుగుట్ట తండా వద్ద విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా, టవర్‌క్లాక్ వద్ద బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

తలుపుల: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అక్కడక్కడా పంటలు దెబ్బతినడంతో పాటు పల్లవాండ్లపల్లి వద్ద పెద్ద చెట్టు నేలకొరిగింది. టి.రెడ్డివారిపల్లిలో ఓ రైతు 1.50 ఎకరాల్లో సాగు చేసిన బీర, నంగివాండ్లపల్లిలో టమాట పంటలు దెబ్బతిన్నాయి. మామిడి తోటల్లో సైతం పూత, పిందెలు రాలిపోయాయని రైతులు తెలిపారు.

తనకల్లు: మండలంలో గురువారం అర్ధరాత్రి నుండి కురిసిన వర్షానికి పంటలు నేలకొరిగాయి. ఎగువ, దిగువ చెక్కవారిపల్లిలో ఆకుతోటలు, మొక్కజొన్న పూర్తిగా నేలమట్టమయ్యాయి. వడగండ్ల వానకు సుమారు 80 ఎకరాల్లో ఆకుతోటలు దెబ్బతిన్నట్లు రైతులు చెక్కా వెంకటనారాయణ, శివయ్య, పిగుడు చంద్రయ్య, వెంకటరమణ, వేమనారాయణ, రామకృష్ణ, పిడుగు సుబ్బయ్య, పిడుగు నాగేష్, లక్ష్మీ, నారాయణ, నాగరాజు తదితరులు తెలిపారు. దిగువ చెక్కవారిపల్లిలో 15 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతింది.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ఎగువ, దిగువ చెక్కవారిపల్లి గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, ఆకుతోటలను గ్రామ ఉద్యానవన సహాయకుడు కార్తిక్ శుక్రవారం పరిశీలించారు. పంట నష్టంపై నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

పుట్టపర్తి అర్బన్: గురువారం రాత్రి జిల్లాలోని 24 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో 10.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని ఎన్‌పీ కుంట మండలంలో అత్యధికంగా 38 మి.మీ వర్షపాతం నమోదైంది. అమడగూరులో 32.4 , కదిరిలో 27.8, గాండ్లపెంటలో 25.8 ధర్మవరంలో 24.6, తనకల్లు 24.6, నల్లమాడలో 21.8, పుట్టపర్తిలో 19.6, పరిగిలో 15.2, తాడిమర్రిలో 14.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

అమడగూరు: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వివిధ పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులు శుక్రవారం మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. కసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 20 ఎకరాల్లో మొక్కజొన్న పంట, 35 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. మహమ్మదాబాద్ పంచాయతీలో కూడా అక్కడక్కడా పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జ్యోత్స్న, ఏఈఓ షరీఫ్, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలో గురువారం రాత్రి 25.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. బోరు బావుల కింద సాగు చేస్తున్న వేరుశనగకు నీటితడులతో పాటు పశుగ్రాసం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నల్లచెరువు: మండలం వ్యాప్తంగా గురువారం రాత్రి 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంతులచెరువు గ్రామం ఇందుకూరుపల్లిలో ఈదురుగాలితో కురిసిన భారీ వర్షానికి దాదాపు 40 ఎకరాల మొక్కజొన్న, 30 ఎకరాల్లోని టమాట, పత్తి నేలవాలింది. ఆవుల కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయని రైతులు సోముశేఖర్‌రెడ్డి, షఫిఖాన్, ఆవేదన వ్యక్తం చేశారు.



తనకల్లు: నేలమట్టమైన ఆకుతోటను పరిశీలిస్తున్న వీహెచ్‌ఏ కార్తిక్



తలుపుల: వర్షానికి నేలకొరిగిన బీర పంట



పుట్టపర్తి అర్బన్: కప్పలబండ వద్ద తడిసిపోయిన వేరుశనగను ఆరబోసిన దృశ్యం



కదిరి టౌన్: వాలిపోయిన విద్యుత్ స్తంభం, పడిపోయిన చెట్టు

అసాంఘిక కార్యకలాపాలు చట్టరీత్యా నేరం

అమడగూరు: అసాంఘిక కార్యకలాపాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మహమ్మదాబాద్‌లో గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పేకాట ఆడటం, అనవసరంగా వీధుల్లో మద్యం సేవించి గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అమ్మాయిలను అక్రమ రవాణా చేయడం, బాల్య వివాహాలను చేయడం, ప్రోత్సహించడం ఇలాంటివన్నీ ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా వ్యతిరేకమన్నారు. రాత్రివేలల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తూ కనపడితే వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. అక్రమంగా మద్యం, గుట్కాను రవాణా చేయడం నిషిద్ధమన్నారు. కేసులకు సంబంధించి ఇరువర్గాల వారు రాజీ చేసుకుని లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జమేదారు సుధాకర్, సిబ్బంది రమేష్, భాస్కర్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

తాడిమర్రి: దోమకాటుకు గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీహెచ్‌ఈఓ మనోహర్‌బాబు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని దాడితోట, చిల్లవారిపల్లి, నార్సింపల్లి, తదితర సచివాలయాల పరిధిలో శుక్రవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. యాంటిలార్వా పిచికారీ చేయించారు. మురుగునీటి గుంతలను గుర్తించి పైరత్రియం చల్లించి, వేస్టాయిల్ ఉండలు వేయించారు. అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పాతటైర్లు, పాత కుండలు, చిప్పలు తదితర వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కనగానపల్లి: మండలంలో రెండో విడతలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న మొదటి విడతలో 91 శాతం మంది పిల్లలకు ఈ మాత్రలు వేశామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

- పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్



ఆర్ అనంతపురం సచివాలయంలో వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

మడకశిరరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఆయన శుక్రవారం ఆర్ అనంతపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు, స్పందన అర్జీలు తదితర వాటిపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందలేదని ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు. సచివాలయంలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. క్షేత్ర స్థాయి ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించాలన్నారు. రెవెన్యూ రికార్డులను పారదర్శకంగా ఉంచుకోవాలన్నారు. యూనిఫారంతో విధులకు హాజరుకావాలని ఉద్యోగులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి

మడకశిర మండలంలో అభివృద్ధి పనులకు అవసరమయ్యే భూమిని వేగవంతం సేకరించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మడకశిర తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరు నుంచి మడకశిర మండల మీదగా రాయదుర్గం వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందుకు మడకశిర మండలంలో అవసరమయ్యే భూమిని సేకరించాలన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పెనుకొండ రూరల్: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం మావటూరు పంచాయతీ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సేవలు వేగవంతం చేయాలని, స్పందనలో అందే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సంక్షేమ పథకాల స్టిక్కర్లను సచివాలయం ముందు భాగంలో ప్రజలకు కనిపించేలా అతికించాలన్నారు.

ఎంవీఐపై దాడి తగదు

కదిరి అర్బన్: కాకినాడలో విధి నిర్వహణలో ఉన్న మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ చిన్నారావుపై దాడి చేసిన వాహనదారుడిని కఠినంగా శిక్షించాలని కదిరి ఎంవీఐ వరప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గాయపడ్డ వాహన తనిఖీ అధికారి చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విధులకు ఆటకం కల్గించడమే కాకుండా ఇలా భౌతిక దాడికి పాల్పడటం తగదన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

సోమందేపల్లి: పేటకుంట సమీపంలోని జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొనింది. శుక్రవారం అనంతపురం వైపు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు టైరుపంక్చర్ అయ్యి, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనింది. దీంతో కారు ముందుభాగం దెబ్బతినింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం వారు మరో వాహనంలో బెంగళూరు వెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



తాగునీటి సంపు ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడిమర్రి: న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు శుక్రవారం స్థానిక మద్దులచెర్వు తాగునీటి సంపు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎల్అండ్‌టీ సంస్థ ఇవ్వాల్సిన గ్రాట్యుటీ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణమే చెల్లించాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.26 వేలు చేయాలన్నారు. దీపావళి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై తాగునీటి సరఫరా యాజమాన్యం స్పందించపోతే తాగునీటి సరఫరా బంద్ చేసి, నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మీనారాయణ, మహేశ్వర్‌రెడ్డి, నడిపి ఓబిలేసు, రామకృష్ణ, నరసింహారెడ్డి, తేజ్‌దీప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

అమడగూరు: మండలంలోని శీతిరెడ్డిపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. 100 విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్, డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటరమణ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లిపెద్దతండా గ్రామ పరిసర ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన లాలునాయక్, పార్వతి దంపతులు ద్విచక్ర వాహనంలో వెంకటాంపల్లి పెద్దతండా నుంచి గుంతకల్లుకు బయలుదేరారు. మార్గమధ్యంలో పందికుంట సమీపంలో ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఘటనలో పార్వతి తలకు తీవ్ర గాయాలు కాగా, లాలునాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గురుకుల ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 2023–2024లో ఐదో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మొత్తం 80 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో 70 సీట్లు ఎస్సీలు, 5 ఎస్టీలు, 4 సీట్లు బీసీలు, ఒకటి ఓసీలకు రిజర్వేషన్ చేశారన్నారు. ఈ నెల 24 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

భూ తగాదాలో ముగ్గురిపై కేసు

బొకుగుప్ప: మండలంలోని నక్కపల్లిలో భూతగాదాలో ముగ్గురిపై కేసు నమోదు చేసామని ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు. నక్కలపల్లికి చెందిన సుంకమ్మ కుటుంబానికి చెందిన 94-1, 96-2 సర్వే నెంబర్లలోని భూమిని శుక్రవారం సర్వే చేయిస్తుండగా గ్రామానికి చెందిన సంజీవరెడ్డి, లోకేష్ రెడ్డి, రామ్‌మోహన్‌రెడ్డి దౌర్జన్యం చేస్తూ భూమి తమదే అంటూ మారణాయుదాలతో దాడికి యత్నించారు. సుంకమ్మ ఫిర్యాదు మేరకు దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురిపైనా కేసులు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

అంతర పంటల సాగు.. దిగుబడి బాగు

- రబీలో పెరిగిన సాగు విస్తీర్ణం
- తక్కువ వ్యవధిలో రైతులకు ఆదాయం



కనగానపల్లి వద్ద చీనీ తోటలో సాగు చేసిన వేరుశనగ

కనగానపల్లి: దీర్ఘకాలిక పంటలు సాగు చేసి త్వరగా పంట దిగుబడులు పొందలేని రైతులు.. స్వల్పకాలిక పంటల సాగుతో అధిక ఫలసాయం పొందుతున్నారు. ముఖ్యంగా చీనీ, మామిడి వంటి పండ్ల తోటల్లో వేరుశనగ, దోశ, కాయగూరల పంటలు సాగుచేసి, దిగుబడి సాధిస్తున్నారు.

రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 5 వేల హెక్టర్లలో రైతులు చీనీ, మామిడి వంటి పండ్ల తోటలు సాగు చేశారు. వాటిలో పంట దిగుబడి రావటానికి నాలుగైదేళ్ల కాలం పడుతుంది. దీంతో రైతులు వాటిలో స్వల్పకాలిక పంటలు సాగుచేసి, అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు.

రూ.30 వేల వరకూ ఆదాయం..

ప్రస్తుతం రబీ సీజన్‌లో ఈ అంతర పంటలు సాగు మరింత ఎక్కువగా ఉంది. నియోజక వర్గంలోని కనగానపల్లి, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లో రైతులు జాతీయ ఉపాధిహామీ పథకం మెట్ట భూముల్లో రైతులు మామిడి, చీనీ పంటలు ఎక్కువగా సాగు చేశారు. అయితే ప్రస్తుతం సాగునీటి కాలువలతో పాటు, భూగర్భ జలాలు పెరిగి బోరు బావులో నీరు సమృద్ధిగా వస్తుండటంతో రైతులు తరి పంటల సాగు చేశారు. దీంతో దీర్ఘకాలిక పంటగా ఉండే మామిడి, చీనీ తోటలో రైతులు ప్రస్తుతం వేరుశనగ, దోశ, కలింగర, టమాట, బెండ తదితర ఆరుతడి పంటలను సాగు చేశారు. కనగానపల్లి మండలంలోని తగరకుంట, కోనాపురం, యలకుంట్ల, ముక్తాపురం, ముత్తువకుంట్ల గ్రామాల్లో పలువురు రైతులు ఈ అంతర పంటలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం పంటగా సాగుచేసిన వేరుశనగలో ఎకరానికి రూ.30 వేల దాకా ఆదాయం వచ్చినట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకు ఎంపిక

ధర్మవరం రూరల్: తమిళనాడు రాష్ట్రంలో రామనంతపురంలో ఈనెల17 నుంచి 26వ తేదీ వరకూ జరిగే జాతీయస్థాయి హాకీ పోటీలకు సత్యసాయి జిల్లా నుంచి అఖిల, పావని, ఈశ్వర్ రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకు ఎంపికైనట్లు ధర్మాంబ హాకీ అసోషియేషన్ ప్రతినిధులు బంధనాథం , సూర్య ప్రకాష్, బీవీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం క్రీడాకారులను వారు అభినందించారు.

చలివేంద్రం ఏర్పాటు

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల గ్రామంలోని ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ గోపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వేసవిలో దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసిన యువకుడు అబ్బును అభినందించారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. తాగునీటిని వృథా చేయొద్దని సూచించారు.

బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

- రూ.1.50 కోట్లతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- 20న వేలం ద్వారా దుకాణాల కేటాయింపు
- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం: దీర్ఘకాలంగా బకాయి ఉన్న ఆస్తి పన్ను భవన యజమానులకు ఈనెల 31వ తేదీలోగా బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయడం జరుగుతుందని ఈ మేరకు ప్రభుత్వం జీఓ. ఆర్‌టీ 34 విడుదల చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మవరం మున్సిపాలిటిలో మొత్తం 13,449 మందికి గానూ రూ.9.26 కోట్ల ఆస్తిపన్ను బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని ఈనెల 31వ తేదీలోగా ఏకకాలంలో భవన యజమానులు ఆస్తిపన్ను అసలు చెల్లిస్తే రూ.4.16 కోట్ల దాకా వడ్డీ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. గడచిన రెండేళ్లలో కరోనా లాక్‌డౌన్‌తో ప్రజలు ఇబ్బందులు పడిన దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని వెల్లడించారు.

ఆధునిక సౌకర్యాలతో షాపింగ్ కాంప్లెక్స్

పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో రూ.1.50 కోట్ల వ్యయంతో గుడ్‌విల్ పద్ధతిన సేకరించిన మొత్తం ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం జరుగుతోందన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలకు సంబంధించి ఈనెల 20న ఓపన్ యాక్షన్ ద్వారా వేలం పాట నిర్వహించడం జరుగుతుందని, ఎక్కువ మొత్తం గుడ్‌విల్ చెల్లించిన వారికి దుకాణాలను కేటాయించడం జరుగుతోందన్నారు. దుకాణాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, రజక, నాయీ బ్రాహ్మణులకు రిజర్వేషన్ కల్పించడం జరుగుతోందన్నారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ రూ.1.50 లక్షలు, రూ.2.50 లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. అలాగే కాయగూరల మార్కెట్‌లో వారాంతపు సంత, జంతువధశాలకు సంభందించి సుంకం వసూలు వేలం పాట ఈనెల 21న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను, ఖాళీ జాగాలపై విధించే పన్ను బకాయిలపై వడ్డీ మినహాయింపు ఇవ్వడం జరుగుతుందని పుట్టపర్తి నగర పంచాయతీ కమిషనర్ వెంకట రామిరెడ్డి ఓ శుక్రవారం తెలిపారు.